జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 26-10-2024 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 144 పేజీలు: 8 వెల: రూ.7

## జిల్లా పోలీస్ శాఖలో..

# కులగజ్జి

* శాఖల్లో తమ వారికే ప్రాధాన్యం
* ఇతరులపై బురద జల్లుతున్న ఓ వర్గం
* బాస్ దృష్టికి తప్పుడు ఫిర్యాదులు, సమాచారం
* క్రైం బ్రాంచ్‌లో మరీ దారుణం
* బలపుతున్న నిజాయితీ పోలీసులు, అధికారులు
* జిల్లా పోలీస్ బాస్ దృష్టి సారిస్తే వెలుగులోకి వచ్చే అవకాశం





**శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 25 (వార్త):** జిల్లా పోలీసు శాఖలో ఓ కులం ఆధిపత్య ధోరణి సాగుతోందన్న విమర్శలు ఉన్నాయి. ఓ కులంనకు చెందిన వారే కింది స్థాయి నుంచి పైస్థాయి వరకూ అధికంగా ఉండడంతో వారు చెప్పిందే ఆట.. పాడిందే పాటలా మారింది. ఆ వర్గానికి చెందిన వారికే అన్నింటా పట్టం కడుతున్నారు. వాళ్లకి నచ్చిన వాళ్లకి ఒకలాగా.. నచ్చని వాళ్లకి ఒకలా రిపోర్ట్ ఇస్తున్నారని జిల్లా పోలీస్ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. జిల్లా పోలీసు కార్యాలయంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఆ కులం వారిని ఎవరైనా ఎదిరిస్తే జిల్లా పోలీస్‌బాస్‌కు తప్పుడు నివేదికలు, సమాచారం ఇస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇది ఎక్కువగా టౌన్ పరిధిలోని పోలీస్‌స్టేషన్లలో జరుగుతోందని కొందరు పోలీసులు బాహాటంగానే పేర్కొంటున్నారు. పోలీస్ శాఖకి కీలకమైనది స్పెషల్ బ్రాంచ్. ఆ బ్రాంచ్‌లో ఈ కులగజ్జి అధికంగా ఉందని, దీని ప్రభావం కేసుల దర్యాప్తుపై పడుతోంది. ఎస్‌బీలో ఈ వర్గానికి చెందిన కొందరు ఎప్పటి నుంచో పాతుకుపోయారు. వారు ఈ క్యాస్ట్‌ను కాజ్‌గా చూపించి సక్రమంగా పనిచేయడం లేదు. దీనివల్ల కేసుల దర్యాప్తు నీరుగారిపోతోంది. వీరిని ఎదిరిస్తే ఏమవుతుందో తెలిసిన కొందరు నిజాయితీ అధికారులు, సిబ్బంది తమకెందుకులే ఈ తలనొప్పి అంటూ సైలెంట్‌గా ఉండిపోతున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలోనూ ఇదే తంతు ఉంది. పలు పోలీస్‌స్టేషన్లలో కూడా ఈ మెజార్టీ కులానికి చెందిన వారే చక్రం తిప్పుతున్నారు. కొందరు అధికారులు వారినే కలెక్షన్ల ఏజెంట్లుగా నియమించుకుంటున్నారట. జిల్లా పోలీసు కార్యాలయంలో అవసరమైన వారికన్నా ఎక్కువమంది సిబ్బంది ఉన్నారు. దీనివల్ల మండల పోలీస్‌స్టేషన్లలో సిబ్బంది కొరత అధికంగా ఉంది. దీంతో పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బందిపై పనిభారం పడుతోంది. జిల్లాకు కొత్తగా వచ్చిన డైనమిక్ పోలీస్‌బాస్ దీనిపై పూర్తిస్థాయిలో దృష్టి సారించి ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని కిందిస్థాయి పోలీసులు అభిప్రాయపడుతున్నారు.

## తాను చనిపోతూ.. ముగ్గురికి జీవితం

* అవయవదానానికి ముందుకొచ్చిన జగదీష్ కుటుంబీకులు
* గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాలు సకాలంలో తరలించిన శ్రీకాకుళం జిల్లా పోలీసులు, వైద్యసిబ్బంది



4లో

# పశుగణనకు శ్రీకారం

* దీపావళి నుంచి మూడు సిలిండర్లు * జనవరిలో అమ్మకు వందనం కోసం ప్రణాళిక * అన్ని హామీలు అమలు చేస్తాం * వ్యవసాయ, పశుసంవర్ధక శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**కోటబొమ్మాళి/టెక్కలి, అక్టోబర్25 (వార్త):** 21వ అఖిల భారత పశు గణనలో భాగంగా శుక్రవారం నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు రాష్ట్రంలోని 1.50 కోట్ల కుటుం బాలకు చెందిన పశువుల వివరాలను నమోదు చేయనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక, సహకార, మత్స్య శాఖా మంత్రి కింజ రాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోటబొమ్మాళి మండలం పెద్ద బమ్మిడిలో శుక్రవారం పశు గణనను శాఖ మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ గణనలో వ్యవసాయ పరికరాల వివరాలనూ సేకరిస్తారని, గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, భూమిలేని కుటుంబాలకు ప్రధాన ఆదాయవనరుగా ఉన్న పశుసంవర్ధక రంగాన్ని మెరుగుపరచడానికి అవసరమయ్యే నిధులు, పథకాల రూపకల్పన, అమలు, పర్యవేక్షణకు ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 17,244 గ్రామాలు, పట్టణాల్లోని 3,929 వార్డుల్లో గృహ, గృహేతర వ్యక్తుల నుంచి వివరాలు తీసుకుంటారని, ఇందుకోసం 5,390 మంది సిబ్బంది, 1,237 మంది పర్యవేక్షకులు, 45మంది స్క్రూటినీ అధికారులు, ఇతర సిబ్బంది ఇందులో పాల్గొంటున్నారని వివరించారు. పశుగణన పూర్తయిన ఇంటి తలుపుపై స్టిక్కర్ వేస్తామని అన్నారు. ఈ దీపావళి నుంచి ఏటా మూడు సిలిండర్లు ప్రతి నాలుగు నెలలకు ఒకటి చొప్పున ఇస్తున్నామని ప్రకటించారు. అమ్మకు వందనం జనవరి నెలలో ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఆ దిశగా కృషి చేస్తున్నామన్నారు. రైతులకు పెట్టుబడి సాయం కూడా వీలైనంత త్వరగా ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్. మురళీధర్, డివిజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ వి. జైరాజ్, జిల్లా జనాభా లెక్కల నోడల్ అధికారి డాక్టర్ జి. నారాయణరావు, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం. లోకనాథం, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ ఎం. ప్రజ్ఞాచైతన్య, పశుసంవర్ధక సహాయకుడు, సెన్సస్ ఎన్యుమరేటర్ ఎం. బలరాం, మాజీ ఎంపీటీసీ రామకృష్ణ, వెలమ విజయలక్ష్మి, పూజారి శైలజ, మాజీ సర్పంచ్ శిమ్మ నారాయణరావు, స్థానిక కూటమి నాయకులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ప్రజా ఫిర్యాదుల స్వీకరణకు 15 వినతులు



**పలాస, అక్టోబరు 25 (వార్త):** కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ కేవీ మహేశ్వం రెడ్డి పాల్గొని ప్రజల నుంచి 15 ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖీ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజాఫిర్యాదులకు ప్రాధాన్య మివ్వాలని సూచించారు.





# సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

### * ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి * ఎచ్చెర్ల ఆర్మడ్ మైదానంలో పోలీస్ పరేడ్

**శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 25 (వార్త):** సిబ్బంది సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్నా మని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. సిబ్బంది ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. శుక్ర వారం ఉదయం ఎచ్చెర్ల జిల్లా ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో నిర్వహించిన పోలీస్ పరేడ్‌కు జిల్లా ఎస్పీ హాజరయ్యారు. ఈ క్రమంలో ముందుగా ఆర్మడ్ సిబ్బంది జిల్లా ఎస్పీనకు గౌరవ వందన సమర్పించి అనంతరం పరేడ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సిబ్బంది ప్రతి ఒక్కరు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, ప్రతిరోజు కొంత సమయాన్ని వ్యాయమానికి కేటాయించి మానసిక, శారీరకంగా దృఢంగా ఉండాలని అలాంటప్పుడే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించగలమని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విధులు నిర్వహిం చాలని చెడు అలవాట్లకు బానిస కాకుండా మంచి పౌష్టికాహారాన్ని తీసుకోవాలని అన్నారు. అనంతరం ఆర్మ్ రిజర్వ్ పోలీస్ మైదానంలో జిల్లా ఎస్పీ పోలీస్ సిబ్బంది కొరకు ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నేపథ్యంలో పలువురు పోలీసు సిబ్బంది వారి యొక్క వ్యక్తిగత, ఉద్యోగరీత్యా సమస్య లను వినతలు రూపంలో తెలుసుకున్నారు. సిబ్బందికి వ్యక్తిగత, ఉద్యోగరీత్యా సమస్యల పరిష్కరించి సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని ఎటువంటి సమస్యలు ఉన్న దృష్టికి తీసుకురావాలని సాధ్యాసాధ్యాలు బట్టి సమస్యలు పరిష్కరిస్తానని ఎస్పీ భరోసా కల్పించారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఆర్ఐ కె.నర్సింగరావు, ఎస్ఐలు, ఏఆర్, సివిల్ సిబ్బంది పాల్గొన్నారు

## ఓపెన్‌హౌస్‌పై అవగాహన



**ఎచ్చెర్ల, అక్టోబర్ 25 (వార్త):** అమరవీరుల స్మారక ఉత్సవాలలో భాగంగా ఎచ్చెర్ల పోలీస్ కమ్యూనిటీ హాల్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఏఆర్ పోలీసు అధికారులు, సిబ్బంది పోలీసులు విధి నిర్వహణలో భాగంగా ప్రతి దినం ఉపయోగించే సాంకేతికత పరికరాలు, కమ్యూనికేషన్, బాంబ్ టెక్షన్, డిస్పోజల్ సామగ్రి, వివిధ రకాల ఆయుధాలు, పోలీసు జాగిలాలు పని తీరు, డ్రోన్స్ వినియోగం, వేలి ముద్రల సేకరణ, బాడీవార్న్ కెమెరాలు, లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టమ్, ట్రాఫిక్ పోలీసులు వినియోగించే బ్రీత్ ఎనలైజర్స్, సిగ్నల్స్, స్పీడ్ గన్, ఇతర పరికరాలపై విద్యార్థులకు డీఎస్పీ శేషాద్రి అవగాహన కల్పించారు. అలాగే పర్యావరణ పరిరక్షణలో – పోలీసుల సవాళ్లు” అనే అంశంపై పోలీసు సిబ్బందికి ఎచ్చెర్ల పోలీస్ కమ్యూనిటీ హాల్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోలీసు సిబ్బంది ఉత్సాహంగా ఈ పోటీలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్మ్ రిజర్వ్ డీఎస్పీ ఎల్.శేషాద్రి ఆర్ఐ కె.నర్సింగరావు, ఆర్ఎస్ఐలు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## మద్దువలసలో మద్యం షాపును ఎత్తివేయండి

**వంగర, అక్టోబరు 25(వార్త):** మద్దువలసలో మద్యం షాపును ఎత్తివేయా లని కోరుతూ శుక్రవారం స్థానిక మహిళలు, యువత నిరసన వ్యక్తం చేశారు. మద్దువలస సర్పంచ్ ప్రతినిధి బూరాడ వెంకటరమణ ఆధ్వర్యంలో మహిళలు మద్యం షాపునకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఈ షాపును ఏర్పాటు చేయడం తగదని మండిపడ్డారు. తక్షణం ఈ షాపును వేరే చోటుకు తరలించాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జనావాసాల మధ్య మద్యం షాపులు ఏంటని ప్రశ్నించారు. గురుకుల పాఠశాల, ప్రభుత్వ కళాశాల, రామమందిరం సమీపంలో మద్యం షాపును ఏర్పాటు చేయడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేత వెంకట రావు, మహిళలు, యువత పాల్గొన్నారు.

## హాస్టల్స్ ఆకస్మిక తనిఖీ

**శ్రీకాకుళం లీగల్, అక్టోబర్ 25 (వార్త):** సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు శుక్రవారం శ్రీకాకుళం గవర్నమెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమం హైస్కూల్, రిమ్స్ సమీపంలోని బాయ్స్ హాస్టల్, సింగుపురం వద్ద ఉన్న హాస్టల్‌ను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథ కం అమలుపై ఆరా తీశారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సన్యాసి నాయుడు సూచించారు. అనంతరం వారికి చట్టాలు పట్ల అవగాహన కల్పిస్తూ తగు పరిష్కార మార్గాలను వివరించారు.





## పాస్ పుస్తకంలో మార్పులు చేర్పులకు గ్రామసభలు

**జలుమూరు/నరసన్నపేట, అక్టోబర్ 25(వార్త):** పట్టాదారుల పాస్ పుస్త కాలలో గతంలో చేపట్టిన ఈ సర్వేలో పేర్లు తప్పుబడిన, విస్తీర్ణం పూర్తిగా నమోదు కాకపోయినా వాటిని సరి చేసేందుకే గ్రామ సభలను నిర్వహిస్తున్నామని తహశీల్దార్ టి.సత్యనారాయణ తెలిపారు. శుక్రవారం నరసన్నపేట మండలం కరగాం పంచాయతీ అడవి నారాయణవలస గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. తప్పులు పడిన రైతుల ఖాతాలను పరిశీలించి సరి చేస్తామన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఉర్లాం పాఠశాల తనిఖీ

**జలుమూరు/నరసన్నపేట, అక్టోబర్ 25(వార్త):** నరసన్నపేట మండలం ఉర్లాం ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో పి.దాలినాయుడు వార్షిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలకు ప్రార్థన సమయానికి వెళ్లి అన్ని రకాల రికార్డులను పరిశీలించారు. అలాగే తరగతుల వారీగా పిల్లల సామర్థ్యాలను పరీక్షించి ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, సీఆర్ఎంటీలు పాల్గొన్నారు.





## పశువులను రోడ్లపై వదలొద్దు

**పలాస, అక్టోబరు25 (వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపల్ పరిధిలోని రోడ్లపై వదిలిపెట్టొద్దని మున్సిపల్ కమిషనర్ రామారావు సంబంధిత యజ మానులకు సూచించారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో పశువుల యాజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్లపై పశుసంచారం వల్ల ప్రయాణికులతో పాటు దివ్యాంగులు, పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ట్రాఫిక్, పారిశుధ్య సమస్య తలెత్తుతోందని తెలిపారు. ఇకపై పశువులను యజమానులు రోడ్లపై వదిలేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సగం ధరకే ఆశ్రమానికి స్థలం



**పోలాకి, అక్టోబరు25 (వార్త):** దాతలు ఏర్పాటు చేసిన ఆశ్రమానికి సగం ధరకే స్థలం ఇస్తున్నట్లు శ్రీ రామయోగి సేవా ఆశ్రమం వ్యవస్థాపక అధ్య క్షుడు బమ్మిడి విశ్వనాథం చెప్పారు. రామయోగి సేవాశ్రమం ద్వారా సేవా కార్య క్రమాలు నిర్వహణకు అవసరమైన స్థల సేకరణకు దాతలు సహకారం మరువ లేనిదన్నారు. సుమారు 18 సెంట్లు స్థలాన్ని జామి వాసుదేవరావు, జామి మోహనరావు, జామి మహేశ్వరరావు, లాడి శ్రీరామ్మూర్తి తదితర దాతలు సగం ధరకే ఇచ్చారన్నారు. కార్యక్రమంలో దాతలతో పాటు ఆశ్రమం నిర్వాహకులు లక్ష్మణరావు, గాతలవలస ఎంపీటీసీ ప్రతినిధి లక్ష్మణరావు పాల్గొన్నారు.

## నిత్య జీవితానికి అనుగుణంగా విద్యాబోధన

**జలుమూరు, అక్టోబరు 25(వార్త):** నరసన్నపేట మండలం పోతయ్య పల్లి ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం నిత్య జీవితానికి అనుగుణంగా టీఎల్ఎం ఉపయోగించి విద్యా బోధన చేశారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష సీఆర్ఎంటీ డి.శైలజ టీచ్ టూల్ అబ్జర్వేషన్ నిర్వహించారు. ఉపాధ్యాయ బోధనకు సంబం ధించిన అంశాలను టీచ్ టూల్ యాప్లో నమోదు చేసి ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తప్పనిసరిగా మెనూ పాటించాలి

**మెళియాపుట్టి అక్టోబర్ 25 (వార్త):** ఆశ్రమ పాఠశాలలలో తప్పనిసరిగా మెనూ ప్రకారం విద్యార్థులకు భోజన ఏర్పాటు చేయాలని ఐటీడీఏ ఏపీఓ చిన్న బాబు అన్నారు. శుక్రవారం ఆయన మెళియాపుట్టి మండలంలో గల బందపల్లి ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు చదువుతున్న తీరు, ఏర్పాట్ల వివరాలను సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పెద్ద లక్ష్మీపురం ఆశ్రమ పాఠశాలను సందర్శించి పాఠశాల పరిసరాలు పరిశీలించడంతోపాటు భోజనాలు మెనూ ప్రకారంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని వార్డెన్, ప్రధానోపాధ్యాయులను సూచించారు.

## గణిత దీప్తి పుస్తకాల పంపిణీ

**జలుమూరు, అక్టోబర్ 25(వార్త):** అచ్యుతాపురం జడ్పీహెచ్ స్కూల్లో శుక్రవారం గణిత దీప్తి పుస్తకాలను పంపిణీ చేశామని కంచరాపు నాగరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10వ తరగతిలో వంద శాతం మార్కులు సాధించడానికి ఈ పుస్తకాలు దోహదపడతాయన్నారు. విద్యా ర్థులు ఈ పుస్తకాలను బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత కావాలని కోరారు. ఏమైనా సందేహాలు ఉంటే సంబంధిత మ్యాథ్స్ ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవాలన్నారు.



## డాక్టర్ తంగి సౌజన్యకు అంతర్జాతీయ పురస్కారం



**శ్రీకాకుళం టౌన్, అక్టోబర్ 25 (వార్త):** తంగి సత్యనారాయణ డెంటల్ ఆసుపత్రి అధినేత, ప్రముఖ దంత వైద్య నిపుణురాలు డాక్టర్ తంగి సౌజన్యకు ఇంటర్నేషనల్ బెస్ట్ రిసెర్చర్ అవార్డు లభించింది. తమిళనాడు రాష్ట్ర విద్యాశాఖామంత్రి అంబిల్ మహేష్ పొయ్యమోజీ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని ఈమె చెన్నైలో గురువారం అందుకున్నారు. ఆసియా రిసెర్చ్ అవార్డు-2024లో ఈమె ప్రచురించిన జనరల్‌కు ఈ అవార్డు లభించింది. ఆమె దివంగత మాజీ స్పీకర్ తంగి సత్యనారాయణ మనుమరాలు. ప్రముఖ న్యాయవాది తంగి చంద్రశేఖర్ కుమార్తె.



## ఉచిత యోగ శిక్షణా తరగతులు ప్రారంభం

**శ్రీకాకుళం టౌన్, అక్టోబరు 25 (వార్త):** శ్రీకాకుళం ఇండియన్ రెడ క్రాస్ సొసైటీ పరిపాలన విభాగంలో ఉచిత యోగ శిక్షణా తరగతులను ప్రారంభించామని రెడ్ క్రాస్ కార్యదర్శి బలివాడ మల్లేశ్వరరావు శుక్రవారం తెలిపారు. రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్‌రావు మాట్లాడుతూ యోగ గురువు రామారావు పర్యవేక్షణలో, యోగ శిక్షకురాలు ఎం.గాయత్రీ ఈ తరగతులను నిర్వహిస్తారన్నారు. ప్రస్తుతానికి మహిళల కోసం యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని, త్వరలో పురుషుల కోసం యోగా తరగతులను సైతం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, యోగాతో మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. ఉచిత యోగ కోసం యోగ శిక్షకురాలు ఎం.గాయత్రీ ఫోన్ (94930 43999) సంప్రదించాలన్నారు. యోగ గురువు రామారావు మాట్లాడుతూ ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో, రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్ రావు గత రెండు సంవత్సరాల నుంచి యోగ తరగతులను ప్రారంబిద్దామని అనుకున్నారని, కొన్ని కారణాల వల్ల కార్యరూపం దాల్చలేదన్నారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ కోశాధికారి కనుగుల దుర్గ శ్రీనివాస్, వైకుంఠరావు, బి.సతీష్, బెజ్జిపురం యూత్ క్లబ్ నిర్వాహకుడు ప్రసాద్ రావు, స్వీప్ రమణమూర్తి, కళ్యాణ్, నరసింగ రావు, పెంకీ చైతన్య, గొలివి రమణ, గుణాకర్ రావు, చిన్మయ రావు, సుజాత, నంది ఉమా శంకర్, అయేషా బేగం తదితరులు పాల్గొన్నారు.

## జ్ఞానభారతిలో పోలీస్ ఫ్లాగ్ డే స్టిక్కర్లు పంపిణీ



**ఇచ్ఛాపురం, అక్టోబర్ 25(వార్త):** పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సెక్రెటరీ, సీఈవో జోహార్ ఖాన్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది ద్విచక్ర వాహనాలకు పోలీస్ అమరవీరుల సంస్కరణ దినోత్సవ పోలీస్ ఫ్లాగ్ డే స్టిక్కర్లను అతికించారు. పోలీసు అమరవీరులకు జోహార్ అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, అదనపు పరిపాలన అధికారి సయ్యదా సుల్తానా, ట్రాన్స్పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాష్ పండా, మదీనా తదితరులు పాల్గొన్నారు.

## వంగర ఓపెన్ స్కూల్లో ప్రవేశాలకు గడువు

**వంగర, అక్టోబరు 25 (వార్త):** ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు ఈనెల 31 వరకూ సమయం ఉన్నట్లు వంగర జడ్పీ హైస్కూల్ కో ఆర్డినేటర్ జయకృష్ణ తెలిపారు. 200 రూపాయలతో ఈ నెల 29 వరకు , 500 రూపాయలతో ఈ నెల 31 వరకు స్కూల్లో చేరేందుకు అవకాశం ఉందన్నారు. వంగర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్‌ను మంజూరు చేసిన విషయం విదితమే. ఇందులో జాయిన్ కావలసిన వారు అవసరమైన సర్టిఫికెట్స్ పట్టుకుని వంగర జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఒపెన్ స్కూల్ కో ఆర్డినేటర్‌కు అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 79890 63116 ను సంప్రదించాలని ఆయన సూచించారు.

## భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

**వంగర, అక్టోబరు 25 (వార్త):** రైతుల భూసమస్యలు పరిష్కరించడానికి రీసర్వే జరిగిన గ్రామాల్లో సదస్సులు నిర్వహిస్తున్నట్లు రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి గంగా భవానీ తెలిపారు. శుక్రవారం వంగర మండలంలోని వివిఆర్ పేట గ్రామంలో రెవెన్యూ సిబ్బంది సదస్సును నిర్వహించారు. రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ నాగేశ్వర రావు, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, రైతులు, వీఆర్వోలు పాల్గొన్నారు.



# 16 రకాల జంతువుల గుర్తింపునకు.. పశు గణన

### పశువైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమ భారతి



**మందస, అక్టోబర్ 25(వార్త):** పశు గణనలో భాగంగా 16 రకాల జంతువులను గుర్తించడానికి పశు గణన చేస్తున్నట్టు మందస, హరిపురం పశు వైద్యాధికారులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, డాక్టర్ కిల్లి ఉమభారతి చెప్పారు. మందసలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ పశు గణన శుక్రవారం నుంచి ప్రారంభమైందన్నారు. పశుసంవర్ధకశాఖ సిబ్బంది ఇంటింటికీ వచ్చి ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కుక్కలు, తదితర 16 రకాల పశువులకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తారన్నారు. మందస మండలంలో ధర్మేంద్ర, బాలకృష్ణ, శ్రీనివాస్, హరికృష్ణ, కళ్యాణ్, నేతాజీ, మురళి, ఇంతియాజ్ లను పశుగణన సేకరణ దారులుగా నియమించడం జరిగిందన్నారు. మీ ఇంటికి వచ్చిన విషయ సేకరణ దారులకు మీ పశువుల సమగ్ర సమాచారం అందించి, తద్వారా పశుగణ రంగ పథకాల రూప కల్పనకు సహకరించాలని వారు కోరారు.

### పోస్టర్ ఆవిష్కరణ

**పాతపట్నం, అక్టోబర్ 25(వార్త):** అఖిల భారత 21వ పశుగణన పోస్టర్‌ను పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పశు గణన వివరాలను పక్కాగా లెక్కించాలన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకూ ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకర్‌రావు మాట్లాడుతూ ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకందారుల వివరాలపై ఖచ్చితమైన డేటా ఉన్నప్పుడే ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందించవచ్చన్నారు. పాతపట్నం మండలంలో ఏడుగురు విషయ సేకరణ దారులు, మెలియాపుట్టి మండలంలో ఆరుగురు విషయ సేకరణ దారులు ఈ పశుగణనలో పాల్గొంటారని తెలిపారు. పశువైద్యాధికారులు సూపర్ వైజర్లుగా వ్యవహరిస్తారని చెప్పారు. పశుగణన అంతా ప్రత్యేకమైన యాప్ ద్వారా అప్‌లోడు అవుతుందని చెప్పారు కార్యక్రమంలో మెలియాపుట్టి మండల తెలుగుదేశం మాజీ అధ్యక్షుడు అనపాన రాజశేఖర్‌రెడ్డి, హనుమంతు చంద్రశేఖర్, రిటైర్డు ఎంపీడీవో సలాన చిరంజీవి, సీది పశు వైద్యాధికారి డాక్టర్ బి.శ్రీవాణి, కొరసవాడ



పశువైద్యాధికారి డాక్టర్ పి.అనిల్, పశువైద్య సిబ్బంది శ్యామసుందరరావు, కుమారి, విజయ్ రామ్మోహన్, నారాయణ పాల్గొన్నారు.

### పాడి రైతులు సహకరించాలి

**జలుమూరు, అక్టోబర్ 25(వార్త):** అఖిల భారత పశు గణన కార్యక్రమాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని దీనిని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. శుక్రవారం నరసన్నపేటలో జరిగిన ఓ కార్యక్రమంలో భాగంగా పాడి రైతులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశుగణన వల్ల పశువులకు అందవలసి ఉన్న రాయితీలతో పాటు వివిధ ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.




### సర్వే ప్రారంభం

**భామిని, అక్టోబర్25 (వార్త):** మండలంలో కాట్రగాడ-బి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన 21వ అఖిల భారత పశుగణన ఆంధ్రప్రదేశ్ సర్వేని మండల వైసీపీ అధ్యక్షుడు, ఎంపీపీ ప్రతినిధి తోట సింహాచలం ప్రారంభించారు. గ్రామాలలో ఇంటి ఇంటికి వెళ్లి పశువుల విషయాలను అడిగి ప్రభుత్వ సర్వే సిబ్బంది నమోదు చేసుకుంటారని తోట సింహాచలం తెలిపారు. పశుగణ రంగ పథకాల రూపకల్పనకు సహకరించాలని ప్రజలను సర్వే సిబ్బంది కోరారు.

## చెట్ల కొమ్మల తొలగింపు

**వంగర, అక్టోబర్ 25 (వార్త):** వంగర సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ వైర్లకు అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను ఏఈ సురేష్ బాబు ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం తొలగించారు. చెట్ల కొమ్మలను తొలగింపు సందర్భంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.

## ప్రైవేట్ బస్సు బోల్తా



**ఇచ్ఛాపురం, అక్టోబర్ 25 (వార్త):** జగన్నాధపురం రోడ్డులో మలుపు వద్ద ఒడిశా ప్రయివేటు బస్ బోల్తా పడింది. ఈ మలుపు వద్ద నిత్యం ప్రమాదాలు జరుగు తున్నాయి. రోడ్డు వెడల్పు తక్కువగా ఉండడంతో వాహనాలు వేగంగా వస్తూ ప్రమాదాల బారిన పడుతున్నాయి. బస్సు బోల్తా పడడంతో పలువురికి చిన్న చిన్న గాయాలయ్యాయి.

## 39 ఉపాధి హామీ పనులకు రూ.80 లక్షలు ఖర్చు

**జలుమూరు, అక్టోబర్ 25(వార్త):** ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామానికి అవసరమైన పనులు చేయించుకోవాలని సోషల్ ఆడిట్ ఎస్ఆర్పీ పున్నపు నాయుడు సూచించారు. శుక్రవారం మండలంలోని గొర్రిబంద సచివాలయం ఆవరణలో 2023 - 24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పంచాయతీలో 382 మంది జాబ్ కార్డుదారులు పనిచేస్తున్నారని గత ఆర్థిక సంవత్సరంలో 39 పనులకు రూ.80 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు.



## మురుగు నీటి శుద్ధి కర్మాగారం స్థల పరిశీలన

**ఇచ్ఛాపురం, అక్టోబర్ 25 (వార్త):** పురుషోత్తపురంలో నిర్మించబోతున్న మురుగునీటి శుద్ధి కర్మాగారం కోసం అవసరమైన స్థలాన్ని పలాస ఇంచార్జి ఆర్డీవో కృష్ణమూర్తి శుక్రవారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన వెంట కమిషనర్ రమేశ్, తహసీల్దార్ వెంకటరావు ఉన్నారు.

## నిల్వ మందులను విక్రయించొద్దు

**జలుమూరు, అక్టోబర్ 25(వార్త):** నరసన్నపేట పట్టణంలోని పలు ఫెర్టిలైజర్స్ షాపులను మండల వ్యవసాయ శాఖ అధికారిని సునీత శుక్రవారం తనిఖీలు చేపట్టారు. పురుగుల మందులు, ఎరువులు, విత్తనాలు పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలు చేశారు. ఫెర్టిలైజర్స్ రైతులకు అమ్మేటప్పుడు తప్పకుండా రైతు ఆధార్ కార్డు నెంబర్ నమోదు చేసి విక్రయించాలన్నారు. అధిక ధరలకు అమ్మినా.. ఎక్స్పైర్ అయిన వాటిని అమ్మినా చర్యలు తప్పవని హెచ్చరించారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఉచిత ఇసుకతో ఊపందుకున్న భవన నిర్మాణరంగం



**వంగర, అక్టోబరు 25 (వార్త):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నూతన ఉచిత ఇసుక పాలసీ తీసుకు రావడంతో భవన నిర్మాణ రంగం ఊపందుకుందని రాజాం నియోజకవర్గ ఎస్సీ సెల్ టీడీపీ అధ్యక్షుడు మజ్జి గణపతి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఈ విధంగా ఉచిత ఇసుక పాలసీ విధానం అమలు చేయడం అభినందనీయమన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల్లోనే అమల్లోకి తెచ్చారని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి ప్రభుత్వం ఇసుక మాఫియాను నడిపిందని, ఒక్క ఇసుక కుంభకోణం ద్వారానే రూ.50 వేల కోట్లకు పైగా కొల్లగొట్టారని విమర్శించారు. వైసీపీ నేతలే స్వయంగా ఇసుకాసురుల అవతారం ఎత్తి దోచుకున్నారన్నారు.

## దళితులకి రాజ్యాధికారాన్ని దూరం చేసేందుకే..

# ఎస్సీ వర్గీకరణ

*** మాలలు మేల్కొనకపోతే నష్టపోతాం * హక్కుల సాధన కోసం కార్యోన్ముఖులవుదాం * పలాస సభను ప్రతి ఒక్కరు విజయవంతం చేయాలి * ఎస్సీ, ఎస్టీ, జేఏసీ నాయకులు రామ్ గోపాల్, వేణు, తైక్వాండో శ్రీను**



**శ్రీకాకుళం, అక్టోబరు 25 (వార్త):** దళితులకు రాజ్యాధికారాన్ని దూరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్గీకరణను తెరపైకి తెచ్చాయని ఎస్సీ, ఎస్టీ జేఏసీ నాయకులు కళ్లేపల్లి రామ్ గోపాల్, డా.కంఠ వేణు, తైక్వాండో శ్రీను విమర్శించారు. మాలలంతా ఐక్యంగా ఈ కుట్రలను ఎదుర్కోవాలన్నారు. శ్రీకాకుళంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ హక్కులను సాధించుకోవడం కోసం మాలలందరు కార్యోన్ముఖులు కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఎస్సి రిజర్వేషన్ల పరిరక్షణ, క్రిమిలేయర్ కి వ్యతిరేకంగా రాజ్యాంగ పరిరక్షణలో భాగంగా హక్కుల సాధన కోసం ఈ నెల 27న పలాసలో అవగాహన సదస్సులను నిర్వహించడం జరుగుతుందన్నారు. పలాస డివిజన్ కి చెందిన ఎస్.సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో రైల్వే ఇనిస్టిట్యూట్ వద్ద నిర్వహిస్తున్న ఈ సదస్సుకి మాజీ పార్లమెంట్ సభ్యులు హర్షకుమార్, హైదరాబాద్‌కి చెందిన రిటైర్డ్ ఐడిఏఎస్ పి.ఎస్.ఎన్.మూర్తి, విశాఖ ఆంధ్రా యూనివర్శిటీకి చెందిన ప్రొఫెసర్ జాన్‌లతో పాటు అనేక మంది మేధావులు హాజరవుతున్నారన్నారు. జనాభాలో ఐక్యంగా ఉన్న 25శాతం మంది మధ్య వర్గీకరణ చిచ్చు పెట్టి రాజకీయ లబ్ధి పొందాలని పాలకులు చూస్తున్నారని ధ్వజమెత్తారు. వర్గీకరణ మాటున క్రిమిలేయర్ కుట్ర జరుగుతున్నదన్నారు. దీని వలన ఎస్సీ, ఎస్టీలలోని అన్ని కులాలకు ముప్పు పొంచి ఉందని ఆందోళన వ్యక్తంచేశారు. మనువాదుల కుట్రను ఎదుర్కొనేందుకు మాలలు ముందుండి పోరాడాలని పిలుపునిచ్చారు. ఆర్టికల్ 341 ప్రకారం ఏదైనా ఒక కులాన్ని షెడ్యూల్ కులాల జాబితాలో చేర్చాలన్నా లేదా తీసివేయాలన్నా పార్లమెంటుకు మాత్రమే అధికా రం ఉందన్నారు. రిజర్వేషన్ తగ్గించే అధికారం పార్లమెంటుకు లేదన్నారు. ఆర్టికల్ 442 ప్రకారం షెడ్యూల్‌ట్రైబుల్ (ఎస్టీ) జాబితాలో చేర్చాలన్నా లేదా తీసివేయాలన్నా పార్లమెంటుకు మాత్రమే అధికారం ఉందన్నారు. రాష్ట్రంలో ఏదైనా ఒక కులాన్ని షెడ్యూల్‌క్యాస్ట్, షెడ్యూల్‌ట్రైబులో కలపాలంటే నోటిఫైచేసి పార్లమెంటు పంపిస్తే అక్కడి నుంచి రాష్ట్రపతికి పంపించాలన్నారు. ఎస్సీలను వర్గీకరించే అధికారం రాష్ట్రపతికి లేదన్నారు. ఎస్సీ వర్గీకరణపై ఆగస్టు 1వ తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాజ్యాంగ వ్యతిరేకమన్నారు. ఎస్టీల గురించి అడగకపోయినా ఎస్సీ, ఎస్టీలకు క్రిమిలేయర్ వర్తిస్తుందని పేర్కొనడం దారుణమన్నారు. అస్పృశ్యత ఆధారంగా ఎస్సీలకు రిజర్వేషన్ కల్పించామని, నేడు ఆ రిజర్వేషన్లు ఎత్తివేయడానికి కుట్ర జరుగుతుందన్నారు. మాలలు అందరూ కూడా సంఘటితంగా హక్కుల కోసం పోరాడాలన్నారు. ఈ సదస్సుకి మాల మేధావులు,విద్యావంతులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులకు, మహిళలు, ప్రజాస్వామ్య పరిరక్షణకి పాటుపడిన వారందరూ హాజరుకావాలని వారు కోరారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ పంపిణీ



**జలుమూరు/పోలాకి, అక్టోబర్ 25(వార్త):** అనారోగ్యంతో శస్త్ర చికిత్స చేయించుకున్న పోలాకి మండలం గజపతినగరం గ్రామానికి చెందిన కోల యర్రంనాయుడుకు రూ.51,309 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి శుక్రవారం అందజేశారు. యర్రంన్నాయుడు కోలుకోవాలని సూచించారు.

## జంగిల్ క్లియరెన్స్ పనులు

**భామిని,అక్టోబర్25 (వార్త):** భామిని మండలంలోని కొరమ ఫీడర్ పరిధిలో ఉన్న 11 కేవీ విద్యుత్ లైన్లకు సంబంధించి జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టినట్లు భామిని ట్రాన్స్కో ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ లైన్లపై చెట్ల కొమ్మలు విరిగి పడిపోవడంతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగిందన్నారు. ఈ కారణంచే పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు ఏఈ పేర్కొన్నారు.

## భూ సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు

**భామిని,అక్టోబర్25(వార్త):** పెద్దదిమిలి గ్రామంలో భూ సమస్యలు పరిష్కరించేందుకు శుక్రవారం డీటీ శంకరయ్య, మండల సర్వేయర్ రాజేశ్వరరావు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. పెద్దదిమిలి గ్రామంలో ప్రజలకు ఉన్న భూ సమస్యలపై గ్రామ సభలో చర్చించారు. ఈ సభ ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించామన్నారు. వీరితో పాటు సర్పంచ్ టి.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



## తాను చనిపోతూ.. ముగ్గురికి జీవితం

*** అవయవదానానికి ముందుకొచ్చిన జగదీష్ కుటుంబీకులు * గ్రీన్ ఛానల్ ద్వారా అవయవాలు సకాలంలో తరలించిన శ్రీకాకుళం జిల్లా పోలీసులు**





**శ్రీకాకుళం, అక్టోబరు 25 (వార్త):** తాను చనిపోతూ మరో ముగ్గురి జీవితాల్లో జగదీష్ వెలుగులు నింపాడు. వివరాల్లోకి వెళితే.. సోంపేటకు చెందిన జి.జగదీష్ (41) ఈనెల 22న అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అతన్ని వెంటనే రాగోలులోని జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. జగదీష్ తలలో తీవ్ర రక్తస్రావం జరుగుతున్నట్లు వైద్యులు గుర్తించారు. మూడు రోజుల పాటు వైద్యులు అతనికి చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. జగదీష్ బ్రెయిన్ డెడ్ అయినట్లు శుక్రవారం వైద్య బృందం కుటుంబసభ్యులకు తెలియజేసింది. అవయవదానంపై జగదీష్ కుటుంబీకులకు వైద్యులు అవగాహన కల్పించారు. వారు అవయవదానానికి ముందుకురావడంతో రాష్ట్ర జీవన్‌దాన్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అవయవ దానానికి అనుమతులు జారీ చేయడంతో జగదీష్ కిడ్నీలు, ఊపిరితిత్తులను సేకరించి ముగ్గురు రోగులకు కేటాయించారు. రాగోలు జేమ్స్ హాస్పిటల్ నుంచి హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రికి అవయవాలను తరలించేందుకు విశాఖపట్నం ఎయిర్పోర్ట్ వరకు ఎలాంటి ఆటంకం లేకుండా శ్రీకాకుళం పట్టణ పోలీసులు శుక్రవారం గ్రీన్ ఛానెల్‌ని రూపొందించారు. జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ఉత్తర్వులు మేరకు డీఎస్పీ సీహెచ్ వివేకానంద పర్యవేక్షణలో శ్రీకాకుళం రూరల్ సీఐ పైడిపు నాయుడు, ఎస్ఐ రాము, ట్రాఫిక్ సీఐ నాగరాజు, ఇతర పోలీసు అధికారుల సమన్వయంతో పటిష్ట బందోబస్తు నడుమ సకాలంలో విశాఖపట్నం ఎయిర్పోర్ట్‌కు అవయవాలు సురక్షితంగా తరలించారు. జగదీష్ అవయవ దానానికి ముందుకువచ్చిన కుటుంబీకులను జెమ్స్ వైద్యులు అభినందించారు.



## మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

**పాతపట్నం,అక్టోబర్ 25(వార్త):** బైదలాపురం గిరిజన ఆశ్రమ పాఠశాలను సీతంపేట ఐటిడిఏ ఏపీవో జి.చిన్నరావు తనిఖీ చేశారు పాఠశాల పరిసరాలతో పాటు కిచెన్‌లో భోజనం నాణ్యతను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆదేశించారు. విలువలతో కూడిన విద్యను అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్య, ఆహార నాణ్యతలో లోపాలు ఉంటే తెలియజేయాలని విద్యార్థులను కోరారు. ఆయన వెంట హెచ్ఎం, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

## ఎల్ఐసి ఏజెంట్ల నిరసన



**ఇచ్ఛాపురం, అక్టోబర్25(వార్త):** డిమాండ్ల సాధన కోసం 25 రోజులుగా ఎల్ఐసీ ఏజెంట్లు చేస్తున్న సమ్మె శుక్రవారం కూడా కొనసాగింది. స్థానిక శాటిలైట్ బ్రాంచ్ వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో పలువురు ఏజెంట్లు తమ సమస్యలపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటరావు, శ్రీనివాస్, ద్రోణ, దివాకర్ రెడ్డి, రాధ కృష్ణ, మోహన్, నవీన్, నాగేశ్వరరావు, జగదీష్, భాస్కర్, దుర్యోధన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గోతులమయంగా రహదారి



**జలుమూరు/నరసన్నపేట, అక్టోబర్ 25(వార్త):** నరసన్నపేట పట్టణంలోని కంబకాయ జంక్షన్ నుంచి సుమారు పది గ్రామాలకు వెళ్లే రహదారి గోతులమయంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారి గుంతలు పడటంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

## అర్లి టోల్‌గేట్ వద్ద వాహనాల తనిఖీ

**జలుమూరు/సారవకోట, అక్టోబర్ 25 (వార్త):** సారవకోట మండలంలోని జాతీయ రహదారిపై నిర్మించిన అర్లి టోల్ గేట్ దగ్గర శుక్రవారం పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీ చేపట్టారు. జిల్లా ఎస్పీ ఆదేశాలు మేరకు ఒడిశా సరిహద్దు గ్రామాల్లో నుంచి గంజాయి, బాణాసంచా అక్రమంగా రవాణా అవుతున్న నేపథ్యంలో ప్రతీ ఒక్క వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. దీపావళి సమీపిస్తుండడంతో అక్రమంగా బాణాసంచా ఒడిశా నుంచి వచ్చే అవకాశం ఉన్నందున తనిఖీలు ముమ్మరం చేశారు.



Printed and published on behalf of CHOWDARI and printed at RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam. srikakulam dist. ANDHRAPRADESH STATE 532001 published at RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam dist ANDHRAPRADESH STATE 532001 Editor: Chowdari Pramod E-mail:jatheeyavaartha @gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:016413